# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. దేశ వ్యాప్తంగా జరుగుతున్న లోక్ సభ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎన్డీయే అధిక స్థానాల్లో ఆధిక్యం కనబరుస్తోంది.**

**2. రాష్ట్రంలో 25 లోక్ సభ స్థానాలు, 175 శాసనసభా స్థానాలలో జరుగుతున్న ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారు.**

**3. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు.**

**4. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.**

**5. ప్రముఖ చలన చిత్ర గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతి ఈరోజు**

==========================

దేశ వ్యాప్తంగా 18 వ లోక్ సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల సరళి ప్రకారం 543 స్థానాలు గల లోక్ సభలోభారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్.డి.ఎ. కూటమి 240 స్థానాలో అధిక్యంలో కోనసాగుతుంది. మరొక వైపు కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి సైతం 2 వందలకు పైగా స్థానాలలో ముందంజలో వుంది. ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఎన్డీఏ ఆధిక్యత లో వుంది. అయితే, ఉత్తర ప్రదేశ్ లో మాత్రం కాంగ్రెస్ పార్టీ గతంలో కంటే ప్రస్తుతం మెరుగుపరుచుకున్నట్లు కనబడుతోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొత్తం 42 లోక్ సభ స్థానాలు వుండగా ఇండియా కూటమి 26 స్థానాలలోనూ, ఎన్డీయే 16 స్థానాల్లోనూ ఆధిక్యతలో వున్నాయి. 26 లోక్ సభ స్థానాలు వున్న రాజస్థాన్ రాష్ట్రంలో ఎన్డీయే, ఇండియా కూటమిల మధ్య హెూరా హెూరీ పోటీ కొనసాగుతోంది.

---------------------------

రాష్ట్రం లో 25 లోక్ సభ స్థానాలు, 175 శాసనసభా స్థానాలకు జరుగుతున్న ఓట్ల లెక్కింపులో కడపటి సమాచారం అందే సమయానికి తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి స్పష్టమైన ఆధిక్యంలో కొనసాగుతోంది. రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర మూడు ప్రాంతాలలోనూ కూటమి అభ్యర్థులు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల కంటే ఆధిక్యత కనబరుస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలో 52 శాసన సభా స్థానాలు వుండగా దాదాపు 45 స్థానాలలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. అటు ఉత్తరాంధ్ర ప్రాంతంలో 34 స్థానాల్లోనూ 30 కి పైగా స్థానాలలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ

ప్రాంతంలోని పాడేరు, అరకు, సాలూరు, పాలకొండలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఆధిక్యంలో వున్నారు. ఈ ప్రాంతంలోని లోక్‌సభ స్థానాల్లోనూ అరకులో మాత్రమే వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కనబరుస్తోంది. మరొక వైపు, కోస్తాంధ్ర ప్రాంతంలో కూడా అత్యధిక స్థానాలలో తొలి రౌండ్ నుండే కూటమి అభ్యర్థులు ఆధిక్యతను కొనసాగిస్తున్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ ఓట్ల లెక్కింపులో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన పార్టీ అధ్యక్షులు ముందంజలో కొనసాగుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో 15 వేల ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల నియోజకవర్గంలో 35 వేల ఆధిక్యంలో ఉండగా.. జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో 38 వేల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. కాగా.. రాష్ట్రంలో తొలి ఎన్నికల ఫలితం వెలువడింది. రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి 64 వేలకు పైగా మెజారిటీతో గెలుపొందారు.

కడపటి సమాచారం మేరకు వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ 18 స్థానాలలో, తెలుగు దేశం పార్టీ 130 స్థానాలలో, జనసేన 19 స్థానాలలో, భారతీయ జనతా పార్టీ 7 స్థానాలలో ఆధిక్యంలో కొనసాగుతున్నాయి.

---------------------------

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్ళను రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. రద్దయిన రైళ్లలో విజయవాడ - గుంటూరు, గుంటూరు - విజయవాడ రైళ్లు వున్నాయని, వచ్చే జూలై 14 వ తేదీ వరకు ఈ రద్దు కొనసాగుతుందని , ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. అలాగే రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో పలు రైళ్ల బయలుదేరే సమయాలను మార్పు చేసినట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సంత్రాగచ్చి-తాంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఈ రోజు సాయంత్రం 6గంటలకు బదులు 18గంటలు ఆలస్యంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు, హావ్‌డా-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఈ రోజు సాయంత్రం 4.15గంటలకు బదులు 2 గంటల 15 నిమిషాలు ఆలస్యంగా 6.30గంటలకు, విశాఖ-బెనారస్ రైలు రేపు తెల్లవారుజామున 4.20గంటలకు బదులు 2.45 గంటలు ఆలస్యంగా అంటే ఉదయం 7.05 గంటలకు బయలుదేరేలా మార్పు చేశామని తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లా పరిధిలోని శేషాచలం అడవులను రాష్ట్ర అటవీశాఖ దళాధిపతి ప్రిన్సిపాల్ ఛీఫ్ కన్జర్‌వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. శేషాచలం అడవుల్లోని తిరుమల నుంచి తలకోన వరకు ఉన్న అటవీ ప్రాంతంలో సందర్భంగా ఎర్రచందనం ఉండే ప్రదేశాలను, అక్రమ రవాణా జరిగే సమస్యాత్మక ప్రాంతాలను, అరుదైన జాతులకు చెందిన వృక్షాలను, ఔషధ మొక్కలను పరిశీలించారు. అనంతరం ఎర్రచందనం సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎర్రచందనం సంరక్షణకు, అక్రమ రవాణా అడ్డుకోవడానికి, వన్యప్రాణుల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

---------------------------

కృత్రిమంగా తయారైన పళ్ల రసాలను 100 శాతం ఫ్రూట్ జ్యూస్ గా పేర్కొంటూ వాణిజ్య సంస్థలు విక్రయించడం పట్ల భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ -ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరికలు జారీ

చేసింది. ఈ నేపథ్యంలో ఆయా సంస్థలు ఆ పదాలను తొలగించాలని ఆదేశించింది. ఇప్పటికే ముద్రణ చేయించిన ఉత్పత్తులపై ఆ పదాలను తొలగించేందుకు ఈ ఏడాది సెప్టెంబర్ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపింది. ఆహార భద్రత ప్రమాణాల ప్రకారం కృత్రిమ పానీయాలను 100% ఫ్రూట్ జ్యూస్ గా పేర్కొనడం సరికాదని తెలిపింది.

---------------------------

గాన గంధర్వుడు ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం జయంతి ఈరోజు... తెలుగు సినీ సంగీత ప్రపంచంలో ఆయనకు ముందు తర్వాత అనేంతగా తెలుగుతో పాటు దక్షిణాది చలన చిత్ర ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యం 1946 జూన్ 4వ తేదీన అప్పటి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కోనేటమ్మపేట గ్రామంలో జన్మించారు. శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్నచిత్రం ద్వారా తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టారు. తమిళ, కన్నడ, మలయాళ, హిందీ తదితర భాషల్లో వేలాది పాటలు పాడారు. సాగర సంగమం, స్వాతిముత్యం, రుద్రవీణ చిత్రాలకు జాతీయ అవార్డులు అందుకొన్నారు. 40 వేలకు పైగా పాటలు 11 భాషలలోపాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి ప్రపంచంలోనే ఒక అరుదయిన రికార్డు ఆయన సొంతం చేసుకున్నారు. ఉత్తమ గాయకుడిగా ఆరుసార్లు జాతీయ అవార్డు.. కేంద్రం ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ... పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ ప్రదానం చేసింది. తన అమృత గానంతో దశాబ్దాల పాటు ప్రజలను రంజింపజేసి 2020 సెప్టెంబర్ 25న 74ఏళ్ల వయసులో దివంగతులయ్యారు.

---------------------------

రాష్ట్రంలో నైరుతీ ఋతుపవనాల విస్తరణ వేగం కొనసాగుతోంది. ప్రస్తుతం కోస్తాంధ్ర ప్రాంతంలోని నరసాపురం వరకు విస్తరించిన నైరుతీ ఋతుపవనాలు, నాలుగైదు రోజులలో మిగిలిన ప్రాంతాలకూ విస్తరించేందుకు సానుకూల పరిస్థితులు నెలకొన్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం , బంగాళాఖాతం నుండి వీస్తున్న తేమ గాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో నిన్న భారీ వర్షాలు కురిసాయి. కాగా రాయలసీమ ప్రాంతంలోని అనేక చోట్ల ... కోస్తాంధ్ర ప్రాంతంలోని పలు చోట్ల ఈ రోజు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో భూతాపాన్ని పెంచిన సహజ సిద్ధ ఎల్ నినో పరిస్థితి ముగుస్తోందని ప్రపంచ వాతావరణ సంస్థ -డబ్ల్యుఎం.ఓ తెలిపింది. ఎల్ నినో స్థానంలో వచ్చే జూలై - సెప్టెంబర్ నెలలలో లా నినో ఏర్పడడానికి అవకాశాలు కనబడుతున్నాయని, దీని వల్ల ఋతుపవనాల సీజన్ లో మంచి వర్షాలు కురవడానికి సానుకూల పరిస్థితులు వున్నాయని ఆ సంస్థ తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ అత్యంత ఉష్ణమయ మాసంగా రికార్డు సృష్టించిందని, అంతకు ముందు వరుసగా పది నెలలలోనూ ఇదే పరిస్థితి నెలకొందని తెలిపింది. గత 13 నెలలలోనూ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయని, ఇందుకు ఎల్ నినో పరిస్థితి ప్రధాన కారణమని డబ్ల్యుఎం.ఓ పేర్కొంది.

---------------------------

జూలై 28న జరగనున్న గ్రూప్-2 ప్రధాన పరీక్ష రాయబోయే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలు, జిల్లా, జోనల్ పోస్టుల వివరాలను ప్రాధాన్య క్రమంలో నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్- ఏపీపీఎస్సీ తెలిపింది. రేపటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు నమోదుకు అవకాశం కల్పించినట్లు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో వెల్లడించింది.

---------------------------

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవచ్చని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై.గోపాల కృష్ణ తెలిపారు. గుంటూరులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్య వర్తిత్వంపై రెండో విడత శిక్షణ తరగతులని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఎంపిక చేసిన న్యాయాధికారులు హాజరయ్యారు. ఈ సందర్బంగా వై.గోపాల కృష్ణ మాట్లాడుతూ, ఈనెల 7వ తేదీ వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరిచుకునే ప్రక్రియను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వ చట్టం-2023లో పలు మార్పులు చేసిందని తెలిపారు. ఆ చట్టం త్వరలోనే అమల్లోకి వస్తుందని చెప్పారు.

======================